క్లుప్తంగా

సర్పవరంలో ఆధ్యాత్మిక సందడి



సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మి అమ్మవారితో భావనారాయణ స్వామి ఊరేగింపు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కల్యాణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, సాయంత్రం గ్రామంలో స్వామివారు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ కల్యాణోత్సవ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఉదయం కాకినాడ సూర్యారావుపేట సాగర తీరాన స్వామివారికి చక్ర స్నానం నిర్వహించనున్నట్టు ఈఓ తెలియజేశారు.

తల్లిని మించిన దైవం లేదు



రమణయ్యపేటలో మాతృ మూర్తులకు దుస్తులు అందజేస్తున్న పిల్లలు

కాకినాడ రూరల్: తల్లిని మించిన దైవం లైదని, నవ మాసాలు మోసి జన్మనించిన దైవం అమ్మ అని రిటైర్డ్ ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడబాల రత్నప్రసాద్ సహకారంతో మాతృమూర్తులకు వారి పిల్లలతో నూతన దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్ నాయుడు, కొమ్మూరి శ్రీనివాసరావు, కుమార్ యాదవ్, అడబాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంక్ ప్రారంభం

కరప: పెద్దాపురప్పాడు గ్రామంలోని ఎస్టీ వీధిలో ఆదివారం జల జీవన్‌మిషన్ నిధులు రూ.66.6 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంకు ఇంటింటా కుళాయిలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో ఆందోళన



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జవహర్

కాకినాడ రూరల్: మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, పౌష్టికాహార లోపం వంటి కారణాలతో మధుమేహ వ్యాధిగ్రస్తులు సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోందని వైద్యుడు జవహర్ పేర్కొన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టరు జవహర్ మాట్లాడుతూ పెద్దలకే కాకుండా పిల్లలకు మధుమేహం వస్తోందని, అశ్రద్ధ చేస్తే గుండెపోటు, మూత్ర పిండాల వైఫల్యం, పక్షవాతం, నాడీ వ్యవస్థ దెబ్బ తినడం, అంధత్వం, మానసిక సమస్యలు వేధించే అవకాశం ఉందన్నారు. వ్యాధిగ్రస్తులు ఇంట్లో గానీ బయట గానీ పాదరక్షలు లేకుండా నడవరాదన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టరు దాసరి శ్రీధర్, యనమల రామం, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, కుమార్ యాదవ్, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో జిల్లా 3వ ఓపెన్ తైక్వాండో పోటీలు

పిఠాపురం: స్థానిక భాష్యం హైస్కూల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 3వ ఓపెన్ తైక్వాండో పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నల మూలల నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. పోటీల అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బి అసోసియేషన్ చైర్మన్ రమన్న రాజు, సభ్యులు ఇమ్మిడి శెట్టి నాగేంద్ర కుమార్ చైతన్య, పోటీలో నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ విద్యాసంస్థలు చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు, పిఠాపురం భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ వేణు విజేతలను అభినందించారు.

నాణ్యతకు తిలోదకాలు

- శుచి, శుభ్రతలు పాటించని హోటళ్లు
- ఇష్టానుసారం ఆహార పదార్థాల విక్రయాలు
- మిగిలిపోయిన వెజ్, నాన్‌వెజ్ వంటకాల నిల్వ చేసి అమ్మకాలు
- లాభార్జనే ధ్యేయంగా వ్యాపారం



కాకినాడ నగరంలో ఒక హోటల్‌లో వంటనూనె పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు



ఇటీవల దాడుల్లో తినడానికి పనికిరాని నిల్వ ఉంచిన మాంసం, ఇతర వస్తువులను గుర్తించిన అధికారులు

బోట్‌క్లబ్: వేడి వేడి, రంగు రంగుల ఆహార పదార్థాలు నోరూరిస్తాయి. పొగలు కక్కుతూ ప్లేట్‌లో కనిపిస్తే తినేయాలనిస్తాయి. వెజ్, నాన్‌వెజ్ డిష్‌లన్నీ హోటళ్లలో ఆకట్టుకునేలా ఉంటాయి. కానీ వాటి వెనుక పరిశీలిస్తే అనారోగ్యమే కనిపిస్తుంది. కిచెన్‌లోకి వెళ్లి గమనిస్తే ఒళ్లు జలదరింపజేసే నిజాలు వెలికివస్తాయి. అపరిశుభ్రత, ఆ రోజు మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ చేసి తర్వాత సాగించే అమ్మకాలు, వాడేసిన నూనెను మళ్లీమళ్లీ వాడి వండుతున్న వంటలు ఇలా ఎన్నో ఉన్నాయి. మనుషుల ఆరోగ్యంతో హోటళ్ల యజమానులు ఆడుకుంటున్నారు. నాణ్యతను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వంటకాలు విక్రయించి అనారోగ్యంపాలు చేస్తున్నారు. వాటికి గమనించి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు కోరుతున్నారు.

అధికారుల తనిఖీలు

హోటళ్లకు వెళ్లి ఎంతో ఇష్టంగా లొట్టలేసుకుని మరీ ఆహార పదార్థాలు ఆరగిస్తున్నాం. వాటి వల్ల రోగాలను కొని తెచ్చుకుంటున్నాం. ప్రమాదకర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నాం. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఇటువంటి ఆహారాన్ని అమ్మే కర్రీ పాయింట్లు, హోటళ్లు ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీల్లో తేలింది. ఇటీవల నెల రోజుల్లో వ్యవధిలోనే నగరంలో 20కి పైగా కేసులు నమోదు నమోదయ్యాయి. నగరంలోని ఒక హోటల్‌లో గడువు తేదీ ముగిసిన తర్వాత కారంపొడి, ధనియాలు పొడి వంటివి గుర్తించిన అధికారులుల వారిపై కేసు నమోదు చేశారు.

నిల్వ పదార్థాల విక్రయం

కాకినాడ నగరంలో వందకుపైగా వెజ్, నాన్‌వెజ్ హోటళ్లు ఉన్నాయి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం డిన్నర్ వరకూ రకరకాల ఆహారాన్ని అందిస్తున్నాయి. అయితే వీటిలో పేరు పడిన హోటళ్లు కూడా మిగిలిపోయిన ఆహారాన్ని నిల్వ చేసి తర్వాత అందిస్తున్నట్టు అధికారులు దాడుల్లో బహిర్గతమయ్యింది.

బిర్యానీ.. చికెన్.. ఎప్పటివో?

రాత్రి మిగిలిపోయిన బిర్యానీ, చికెన్‌ను మరుసటి రోజు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ప్రకారం వాటిని మరుసటి రోజు విక్రయించకూడదు. కేవలం పచ్చి మాంసం, నిర్ణీత టెంపరేచర్‌లో ఉంచుకోవాలి. కానీ హోటల్ వాళ్లు సాధారణ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మరీ మాంసం మరుసటి రోజు వినియోగదారులకు వండి విక్రయిస్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త



కలుషిత ఆహారం తినడం వల్ల అనారోగ్యపాలవడం తప్పదు. బయట హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద తీసుకొనే ఆహారంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మాంసాహారంలో రంగులు కలపడం వల్ల క్యాన్సర్ వస్తుంది. వంటల్లో వాడే ఫుడ్ కలర్, అజినోమోటో, నిల్వ ఉంచిన మాసం తినడం వల్ల అనేక రకాలైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ చిట్ల కిరణ్, ఎండి, అమృత ఎమర్జెన్సీ ఆసుపత్రి

వెంటనే చర్యలు తీసుకుంటాం



నిల్వ ఆహార పదార్థాలు ఎవరైన విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలి. వాటిని ల్యాబ్‌కు పంపి అది నిజమని రిపోర్టులో తేలితే సంబంధిత హోటల్ యజమానిపై చర్యలు తీసుకొంటాం. రంగుమారిన నూనె కూడా వ్యాపారులు ఉపయోగించకూడదు. అలా ఎవరైన ఉపయోగిస్తే 99896 88699 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు

– శ్రీనివాస్, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి

యుద్ధ వీరుడు మురళీనాయక్‌కు ఘన నివాళి



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న స్థానికులు

కాకినాడ రూరల్: ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని దేశ కోసం ప్రాణాలు కోల్పోయిన యుద్ధ వీరుడు మురళీ నాయక్‌కు రమణయ్యపేటలో ఘన నివాళులర్పించారు. దేశానికి సేవ చేయాలని 2022 నవంబరులో భారత సైన్యంలో చేరిన మురళీనాయక్ దేశ భద్రతలో ప్రాణాలు పణంగా పెట్టి అమరడయ్యాని పలువురు పేర్కొన్నారు. వారిలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రిటైర్డ్ జనరల్ మేనేజరు ప్రసాద్ నాయుడు, అడబాల రత్న ప్రసాద్, ఓం నమశ్శివాయ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పంచారామ క్షేత్రంలో కార్తికేయ మిశ్రా పూజలు



కార్తికేయ మిశ్రా దంపతులకు స్వామివారి ఫొటో అందజేసిన ఆలయ సూపరింటెండెంట్

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవ స్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, మూల విరాట్, ఉప ఆలయాలను దర్శించుకున్న మిశ్రా కుటుంబ సభ్యులు స్వామివారికి అమ్మవార్లకు పూజలు చేశారు. పూజలు అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు వారి స్వామి వారి ఫొటో, ప్రసాదం అందజేశారు.

15న మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

సామర్లకోట: ఈనెల 15వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై ఆ పార్టీ చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తల్లి దవులూరి పార్వతికి ఇవ్వాల్సి ఉంది. అయితే కుటుంబంలో ఒకే పదవి అనే నినాదంతో దొరబాబు తన తల్లికి దక్కాల్సిన చైర్‌పర్సన్ పదవిని 27వ వార్డు కౌన్సిలరుగా ఎంపికైన గంగిరెడ్డి అరుణకు దొరబాబు కేటాయించారు. దాంతో ఆమెను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 31 మంది సభ్యులు ఉన్న సామర్లకోట మున్సిపాలిటీలో 29 మంది సభ్యులు వైఎస్సార్ సీపీ నుంచి ఎన్నికయ్యారు. ఇద్దరు మాత్రమే టీడీపీ నుంచి ఉన్నారు. 26వ వార్డు కౌన్సిలర్ అనారోగ్యంతో మృతి చెందారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారు. దాంతో టీడీపీ బలం నాలుగుకు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పార్టీకి చెందిన సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు దవులూరి దొరబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ఆమెను రాజీనామా చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడితో చెప్పించారు. దవులూరి పార్వతి చైర్‌పర్సన్ పదవి ఇస్తామంటే రాజీనామా చేస్తానని, ఇతరులకు కేటాయిస్తే రాజీనామా చేసేది లేదని చెప్పినట్టు తెలిసింది. దాంతో గత నెల 2వ తేదీన 22 మంది వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు తమకు బలనిరూపణకు అవకాశం ఇవ్వాలని కలెక్టరు షణ్మోహన్‌కు, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రాలు అందజేశారు. దాంతో ఈనెల 15వ తేదీన జిల్లా కలెక్టరు బలనిరూపణ చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కాకినాడ ఆర్డీఓ మల్లిబాబును ప్రత్యేకాధికారిగా కలెక్టరు నియమించినట్టు తెలిసింది. కాగా మున్సిపల్ చైర్‌పర్సన్ బల నిరూపణ జరుగకుండా అడ్డుకునే విధంగా హైకోర్టును ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది.

ఘనంగా గంగమ్మ జాతర ప్రారంభం



పెద్దాపురప్పాడు గ్రామదేవత గంగమ్మతల్లి (గోవతాళ్లు)



పెద్దాపురప్పాడు గ్రామదేవత గంగమ్మతల్లి జాతరకు వచ్చిన వ్యక్తులు

కరప: పెద్దాపురప్పాడు గ్రామ దేవత గంగమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర(యాదవుల సంబరం) మూడు రోజులు పాటు నిర్వహిస్తామని ఆలయకమిటీ, గ్రామపెద్దలు తెలిపారు. గోవ తాళ్లనే గ్రామదేవత గంగమ్మతల్లిగా కొలవడం పెద్దాపురప్పాడు గ్రామస్తులకు ఆచారంగా వస్తోంది. గ్రామ దేవతగా కొలిచే గోవతాళ్లను తాటాకు బుట్టలో ఉంచి, ఆలయంలో దూలానికి వేలాడదీసి ఉంచుతారు. జాతరకు నెల రోజులు ముందుగా జిల్లాలో వివిధ గ్రామాల్లో ఉంటున్న యాదవులను ఆహ్వానించగా 150 గ్రామాల నుంచి ఆదివారం తరలిరాగా తాటాకుబుట్టలో ఉన్న గోవతాళ్లను కిందికి దించి, ఆలయ ప్రాంగణంలో ఒకచోట నిలిపి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి గొల్లపల్లి వంశీకులు జాతర మహోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామస్తులు తమబంధువులను, ఇంటి ఆడపడచులను, స్నేహితులను పిలిచి సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడుపుతారు. ఈ మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. పెద్దాపురప్పాడు గ్రామస్తులతోపాటు, పరిసర గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి గంగమ్మతల్లిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గ్రామసర్పంచ్ బిరుదా సరస్వతి, ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి, ఉపసర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, మాజీసర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి ధనలక్ష్మి తదితరలు అమ్మవారిని దర్శించుకున్నారు. గొల్లపల్లి వంశీకులు గొల్లపల్లి అప్పన్నకాపు, గొల్లపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గొల్లపల్లి రామకృష్ణ, గొల్లపల్లి ప్రసాదరావు, గొల్లపల్లి వీరవెంకటసత్యనారాయణ, గొల్లపల్లి సోమశంకర్రావు, ఉంగరాల గంగాధర్‌తిలక్, కనకాల రామ్మోహనరావు తదితరలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రీసెర్చ్ కాన్ క్లేవ్-2025పై సదస్సు



సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆదివారం రీసెర్చ్ కాన్‌క్లేవ్-2025 అంశంపై సదస్సు నిర్వహించారు. ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా కాగ్నోల్యాబ్ సీఈఓ డాక్టర్ ఎం.యోగేశ్వరరావు హాజరై పరిశోధన శక్తి అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రీసెర్చ్‌స్కాలర్‌కు అవగాహన కల్పించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. పరిశోధన విభాగానికి సంబంధించి పేపర్ ప్రజంటేషన్‌లో 2017 నుంచి 2022 వరకూ ప్రపంచ వ్యాప్తంగా చైనా, అమెరికా దేశాలు మొదటి రెండు స్థానాల్లో ఉండగా 1,91,590 పేపర్స్‌తో భారతదేశం నాలుగో స్థానంలో ఉందన్నారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ వి.రవీంద్ర మాట్లాడుతూ పరిశ్రమ, విద్యాసంస్థలు, పరిశోధక విద్యార్థుల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, వినూత్న పరిశోధన, సహకారాన్ని ప్రోత్సహించడానికి రీసెర్చ్‌కాన్‌క్లేవ్ నిర్వహించామన్నారు. సాంకేతిక అభివృద్ధి సాంకేతిక స్థిరత్వం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం ఎగుమతులు చేస్తుందన్నారు. రీసెర్చ్‌స్కాలర్‌కు త్వరలో యూనివర్సిటీలో సెంట్రలైజ్డ్ రీసెర్చ్ సదుపాయం, లైబ్రేరీ, మ్యాట్‌ల్యాబ్ సాఫ్ట్‌వేర్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ సదస్సుకు 210 మంది హాజరు కాగా 110 మంది పోస్టర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్ర, ప్రిన్సిపాల్ మోహనరావు, కో-ఆర్డినేటర్లు ఎ.గోపాలకృష్ణ, కృష్ణప్రసాద్, బీటీ కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాల ప్రదానంలో కాపు ఉద్యోగ సేవా సమితి నేతలు

కాకినాడ రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పేద కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను కాపు ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఆర్ నగర్‌లోని శుభం కాపు కల్యాణ మండపంలో ఆదివారం అందజేశారు. కాపు విద్యా భరోసా పథకం కింద ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఇంటర్మీడియెట్ విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును కాపు ఉద్యోగ సేవా సమితి భరించనుంది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 70 మంది విద్యార్థులను ప్రతిభా పురస్కారాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైజాగ్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న చేబ్రోలుకు చెందిన ఉలవకాయల నూకరాజు, కేయూఎస్ఎస్ నేతలు బావిశెట్టి లక్ష్మీనారాయణ, దొరబాబు, ముమ్మిడిశెట్టి వెంకటరమణ, కనపర్తి నూకరాజు, యంగ్‌మెన్స్ అసోసియేషన్ వాకాడ చిన్న, టీవీవీ సత్యనారాయణ, ఉదయ్ భాస్కర్, శ్రీనివాస్, మోహన్, ఆదిత్య మూర్తి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌పై కేసు



కరపలో చైన్ స్నాచింగ్‌పై బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ చైతన్యకృష్ణ, ఎస్‌ఐ సునీత

కరప: తల్లీకూతుళ్లు అమ్మవారి జాతరకు వెళుతుండగా మోటారుసైకిల్‌పై వెంబడించి, మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కొనిపోయిన ఘటన కరప గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కాకినాడలోని గైగోల్‌పాడుకు చెందిన నక్కా లక్ష్మీ అలేఖ్య తనకు మార్తె హాసికతో స్కూటీపై కరప మండలం జెడ్.భావారంలో జరుగుతున్న వనువులమ్మ జాతర చూడడానికి బయలుదేరి వెళుతున్నారు. కరప శివారున ఉండే డంపింగ్‌యార్డు దగ్గరకు వచ్చేసరికి కాకినాడ వైపు నుంచి వేళంగి వైపు వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి మోటారుసైకిల్‌పై అలేఖ్య వెనకాల వెంబడిస్తూ వచ్చి హాసిక మెడలులోని బంగారు గొలుసును లాక్కొని వేగంగా వెళ్లిపోయాడు. సదరు గొలుసు రెండు కాసులు ఉంటుందని, బాధితురాలు అలేఖ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప కేసు నమోదు చేసినట్టు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కరప ఎస్‌ఐ టి.సునీత తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కరప: పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడి చేసి, ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 2,730 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం గురజనాపల్లి గ్రామశివారులో కొంతమంది పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్‌ఐ టి.సునీత సిబ్బందితో కలిసి దాడి చేశారు. జూదరులను అరెస్టు చేసి, నగదును సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేశారు. నిందితులను సోమవారం కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

సేవలకు సలాం



ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలింతకు అత్యవసర సేవలు అందిస్తున్న నర్సులు

- ప్రాణ రక్షణలో ఆపద్బాంధవులు
- రోగులకు రక్త సంబంధీకుల్ని మించి సేవలు
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

కాకినాడ క్రైం: ఏ ఉద్యోగమైనా జీతం కోసం చేస్తారు. కానీ నర్సింగ్ వృత్తి అందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. నర్సులు 24 గంటలకు రోగుల సేవలోనే ఉంటారు. ఆపత్కాలంలో రోగులకు తోడు ఉంటూ వారి కన్నీళ్లను తుడుస్తారు. ఎంతో మంది ప్రాణాలను కాపాడుతూ జీవితాలను అందిస్తారు. ఇంతటి సేవలందిస్తున్న నర్సులకు సలాం చేస్తూ నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం..

వైద్య సేవలకు మూలాధారం

వైద్యుల నుంచి పారా మెడికల్ సిబ్బంది వరకు రోగి సేవలలో పాలు పంచుకొని వారితో ఎక్కువ సమయం గడిపేది నర్సులే. మందులు ఇవ్వడం నుంచి ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులకు సమయానికి అన్ని అందించడంలో వారే ఉంటారు. అత్యవసర వేళల్లో వైద్యుల వద్దకి పరుగులు తీస్తుంటారు. రోగి ఆసుపత్రిలో జాయిన్ అయిన నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకూ సేవలందిస్తారు. కాకినాడ జీజీహెచ్‌లో నర్సుల సేవలే మూలం. కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న వారు 405 మంది కాగా, రెగ్యులర్ విధానంలో పని స్తున్న నర్సులు 183 మంది. మొత్తం 587 మంది నర్సులు జీజీహెచ్‌లో యావత్ వైద్య సేవల కీలక పాత్ర పోషిస్తున్నారు.

వృత్తి పరంగా సవాళ్లు

సిబ్బంది కొరత కారణంగా నర్సుల పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. స్టాఫ్‌లు ఇతర విధులకు కూడా వినియోగిస్తున్నారనే అసంతృప్తి నర్సింగ్ వర్గాల్లో నెలకొంది. నాన్ నర్సింగ్ విధులతో కాంట్రాక్టు సిబ్బందితోపాటు రెగ్యులర్ సిబ్బంది పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పలుమార్లు వార్డులు వదిలేసి సంతకాలు, బ్లడ్ బ్యాంకులు, మందులు అంటూ బయటికి వెళ్లాల్సిన వస్తోంది. దీంతో రోగులకు వైద్య సేవల్లో నాణ్యత లోపిస్తోంది. ఇంత చేసిన కాంట్రాక్టు నర్సులకు అయితే కనీసం ఉద్యోగ భద్రత కూడా ఉండదు. ఆజమాయిషీల మధ్య వృత్తి జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. సమాన పని చేస్తున్నా వీరికి సమాన వేతనం మాత్రం ఉండదు. ఒక్కోసారి రెండు మూడు నెలలకు ఒకసారి జీతాలు వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాగే రాత్రి వేళల్లో ప్రధానంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతో పాటు ఏరియా, టీచింగ్ ఆసుపత్రుల్లో నైట్ డ్యూటీలు చేస్తున్న నర్సులు భద్రతా లోపంతో బిక్కుబిక్కు మంటూ వృత్తి జీవితాలు నెట్టుకొస్తున్నారు.



పీఐసీయూలో నాలుగు నెలల శిశువుకు సెలైన్ పెట్టేందుకు కాన్యులా వేస్తున్న నర్సు

నర్సెస్ డే సందర్భంగా..

నర్సెస్ డే సందర్భంగా జిల్లా నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలోని జీజీహెచ్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. కేక్ కట్ చేసి నర్సింగ్ డే ప్రాధాన్యాన్ని వివరిస్తారు. అనంతరం పేద రోగులకు అల్పాహారాన్ని అందిస్తారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 సంధ్యారాణి, గ్రేడ్-2 జయశ్రీ పర్యవేక్షణలో నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బూరిగ విజయలక్ష్మి, గట్టు ప్రమోద సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా నర్సులు పాల్గొంటారు.

అంతా ఐక్యంగా..





నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికైన తర్వాత తొలిసారి రెగ్యులర్, కాంట్రాక్టు సిబ్బంది ఐక్యంగా జరుపుకొంటున్న తొలి నర్సెస్ డే ఇది. ఈ ప్రత్యేకతను నిర్వహణలో చాటనున్నాం. నర్సెస్ డే ఆదర్శాన్ని రోజువారీ విధి నిర్వహణలో ప్రస్ఫుటించేలా చేయాలన్నదే మా సంకల్పం. రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిచాలనే మా తపనకి అధికారులు సహకరించాలని కోరుకుంటున్నాం.

– బూరిగ విజయలక్ష్మి, గట్టు ప్రమోద, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

తమ ప్రాణాలు అడ్డేసి



తమ ప్రాణాలు అడ్డేసి రోగి ప్రాణాలు కాపాడే నైజం నర్సులది. వివిధ అనారోగ్యాలతో వచ్చే రోగులకు వైద్యసేవలు అందించడం అంటే అక్షరాలా ప్రాణాలతో చెలగాలమే. వారి సూది లేదా మరేదైనా వస్తువు కనీసం తాకినా నర్సులకు ప్రాణ సంకటం. అటువంటి విపత్కర పరిస్థితుల్లో పని చేస్తున్న నర్సుల విధి నిర్వహణలో తగిన భద్రత, భరోసా కల్పించేందుకు సమాయత్తమయ్యాం. ఈ క్రమంలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నాం. పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. నర్సులందరికీ వరల్డ్ నర్సెస్ డే శుభాకాంక్షలు.

– డాక్టర్ ఎంపీఆర్ విఠల్, సూపరింటెండెంట్, జీజీహెచ్